# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY
VOLUME: 16 ISSUE:152

తెలుగు దినపత్రిక



**లంచగొండుల వివరాలు ఏసిబికి తెలపండి**

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఎసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్:(040) 2475132, 247456,24745626


## ముందుకు సాగని ఎస్ ఐఆర్

హైదరాబాద్,హైదరాబాద్ ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా నడవటం లేదు. బీఎల్‌ఓలు ఎన్యుమరేషన్ ఫారంలను పంపిణీ చేసి తిరిగి ఇవ్వాలని ఎన్నికల కమిషన్ వెల్లడించింది. హైదరాబాద్ లో మాత్రం బీఎల్‌ఓలు ఎస్ఐఆర్ ప్రక్రియలో చురుగ్గా పాల్గొనడం లేదు. హైదరాబాద్ నగరం పరిధి ఎక్కువ కావడం, అపార్ట్ మెంట్లు ఎక్కువగా ఉండటంతో వాచ్ మెన్ కు ఎన్యుమరేషన్ ఫారాలు ఇచ్చి వెళ్లిపోయే వారి సంఖ్య ఎక్కువగా కనపడుతుంది. ఎన్యుమరేషన్ ఫారాలు నింపడానికి అవసరమైన సలహాలు, సూచనలు కూడా చేయకపోవడంతో బీఎల్‌ఓలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటి వరకూ ఇరవై శాతం మాత్రమే ఎన్యుమరేషన్ జరిగిందని చెబుతున్నారు. బీఎల్‌ఓలు పెద్దగా పట్టించుకోకపోవడంతోనే ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా నడవడం లేదు. పైగా బీఎల్‌ఓలు ఎన్యుమరేషన్ ఫారం పూర్తి చేయడంలో సహకరించాల్సింది పోయి అసలు పట్టీపట్టనట్లు వ్యవహరించడంతోనే ఈ ప్రక్రియ సజావుగా జరగడం లేదు.


నల్లగొండ సంపుటి: 16 సంచిక :171 ఎడిటర్ : సయ్యద్ పాష తేది: బుధవారం 22-07-2026 పేజీలు:4 వెల: 1.00


## కాంగ్రెస్ కక్షతోనే కరవు కోరలు.. కేటీఆర్ సంచలన ఆరోపణలు!



హైదరాబాద్, తెలంగాణ నేలపై నేడు పచ్చని పైర్లు ఎండిపోతుంటే.. అన్నదాతల కళ్లల్లో నీరు సుడులు తిరుగుతోంది. మునుపెన్నడూ లేని విధంగా చెరువులు, జలాశయాలు అడుగంటిపోవడానికి కారణం నిజంగానే ప్రకృతి శాపమా? లేక పాలకుల వైఫల్యమా? దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరవు" అంటూ రేవంత్ రెడ్డి సర్కారుపై ఆయన విమర్శల శరపరంపర కురిపించారు. అసలు జలాశయాల్లో నీరు లేకపోవడానికి, కాళేశ్వరం ప్రాజెక్టును పక్కనబెట్టడానికి మధ్య ఉన్న రాజకీయ కోణం ఏంటి? ప్రాజెక్టుల నిర్వహణ వెనుక సాగుతున్న అసలు కథేమిటి?

ప్రకృతి శాపం కాదు.. పాలకుల పాపం : తెలంగాణలో వ్యవసాయ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే నిర్వీర్యం చేస్తోందని కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో నీటితో కళకళలాడిన చెరువులు, నేడు వెలవెలబోతుండడం వెనుక పాలకుల చేతకానితనమే ప్రస్ఫుటంగా కనిపిస్తోందని దుయ్యబట్టారు. ఎంతో శ్రమకోర్చి నిర్మించుకున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ, కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ ప్రాజెక్టును మూలన పడేశారని విమర్శించారు. ఫలితంగా నేడు లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి, రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు.

ఎల్లంపల్లి నీటి లెక్కలపై ఆందోళన : జలాశయాలలో నీటి లభ్యతపై కేటీఆర్ స్పష్టమైన గణాంకాలను వెల్లడించారు. శ్రీపాద ఎల్లంపల్లి జలాశయంలో ప్రస్తుతం కేవలం 7 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (SRSP) నిండితే తప్ప కడెం ప్రాజెక్టు మీదుగా ఎల్లంపల్లికి నీరు వచ్చే పరిస్థితి లేదన్నారు. ఇలాంటి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో కూడా ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా ఉదాసీనంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని తోడే అవకాశం ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా ముందుకు సాగుతూ నీటిని వృథా చేస్తోందని ఆరోపించారు.

కక్షపూరిత రాజకీయాలకు బలవుతున్న రైతన్న : రాష్ట్రంలో అన్నదాతల ఆత్మహత్యలు పెరిగిపోతున్నా ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. "రైతులు ప్రాణాలు కోల్పోతున్నా ఈ సర్కారుకు చీమకుట్టినట్లయినా లేదు" అంటూ మండిపడ్డారు. కాళేశ్వరాన్ని ఒక వైఫల్యంగా చూపించే క్రమంలో, రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం కాళేశ్వరం లోపాలను సరిదిద్దే నెపంతో కాలయాపన చేస్తోందని, రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఇచ్చిన నివేదికను కూడా బుట్టదాఖలు చేసిందని ఆరోపించారు.

## విద్యార్థులపై టియర్ గ్యాస్ వేస్తారా యూజ్ లెస్ ఫెలోస్..



న్యూఢిల్లీ, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో సీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో యువత చేపట్టిన ఆందోళనపై పోలీసులు లాఠీచార్జి, టియర్ గ్యాస్ ప్రయోగించడంపై కాంగ్రెస్ రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ పార్లమెంట్ ఎగ్జిట్ గేట్ వద్ద కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ పక్కన ఉండగానే ఆమె ఘాటు వ్యాఖ్యలతో ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇదేం పిరికిపందల ప్రభుత్వం.. రైతులపై వాటర్ కెనాన్, విద్యార్థులపై బాష్పవాయు ప్రయోగిస్తారాయూజ్ లెస్ ఫెలోస్ అంటూ మండిపడ్డారు. రేణుకా చౌదరి మాటలకు ధర్మేంద్ర ప్రదాన్ అక్కడి

## బిజెపి నాయకులు... తెలంగాణకు అదనపు నిధులు తీసుకరండి : పొన్నం



హైదరాబాద్: బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు తన రాజకీయ ఉనికిని చాటుకోవడానికి నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. జాతీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎల్-నినో కారణంగా ఏర్పడుతున్న ప్రకృతి విపత్తు పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి, తెలంగాణ ప్రజలను ఆదుకునేందుకు కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని, చేతనైతే రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు, ప్రాజెక్టులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. మంగళవారం పొన్నం తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. ఏ సభలోనూ సభ్యుడు కాకపోవడంతో తన అభిప్రాయాలను అధికారిక వేదికపై చెప్పే అవకాశం ఉందని, అసెంబ్లీ సమావేశాలకు ముందే అనవసర వ్యాఖ్యలు చేస్తూ రాజకీయ ప్రచారం చేసుకోవాలని రామచంద్రరావు ప్రయత్నిస్తున్నారని చురకలంటించారు. రాష్ట్ర ప్రభుత్వం క్యూర్ చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశపెడుతుందని, అక్కడ అన్ని పార్టీలకు తమ అభిప్రాయాలను వెల్లడించే పూర్తి అవకాశం ఉంటుందని, బిజెపి తన వైఖరిని తన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధుల ద్వారా సభలో వెల్లడించవచ్చని, ముందుగానే గందరగోళం సృష్టించే ప్రయత్నాలు చేయడం తగదని పొన్నం హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తుందని, మెజారిటీ ఉందని ప్రతిపక్షాల గొంతు నొక్కే సంస్కృతి మాది కాదు అని, గతంలో బిజెపి ప్రభుత్వం అనేక కీలక చట్టాలను సరైన చర్చ లేకుండానే తీసుకొచ్చిందని, తెలంగాణ ప్రభుత్వం మాత్రం ప్రతి అంశంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ జరిపిన తర్వాతే నిర్ణయం తీసుకుంటుందన్నారు. పార్టీ అధ్యక్ష పదవి ఉన్నప్పటికీ శాసనసభ, శాసనమండలి లేదా పార్లమెంట్‌లో సభ్యుడు కాకపోవడంతో రామచంద్రరావు నిరాశలో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నట్లు కనిపిస్తోందని, జిహెచ్ఎంసి పరిధిలోని పేదలకు ఇళ్లు రావాలా? వద్దా? అనే విషయంలో బిజెపి తన వైఖరిని స్పష్టం చేయాలని పొన్నం డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్లు అందించే కార్యక్రమాన్ని రాజకీయ కోణంలో కాకుండా ప్రజా సంక్షేమ దృక్పథంతో చూడాలన్నారు. ఇళ్ల నిర్మాణ పథకంలో కేంద్ర నిధులు ఉన్నాయని చెబుతున్న బిజెపి నాయకులు, నిజంగా తెలంగాణపై ప్రేమ ఉంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి అదనపు నిధులు తీసుకురావాలని ఆ పార్టీ నాయకులకు సూచించారు. తెలంగాణకు వచ్చే నిధులు ఎవరి దయాదాక్షిణ్యంతో వస్తున్నవి కావు అని, రాష్ట్ర ప్రజలు చెల్లిస్తున్న పన్నుల్లో తెలంగాణకు రాజ్యాంగం కల్పించిన హక్కు మేరకే కేంద్రం నిధులు విడుదల చేస్తోందని పొన్నం తెలియజేశారు. తెలంగాణ ప్రజల పన్నుల వాటా లేకుండా కేంద్ర ప్రభుత్వం నడుస్తుందా అనే విషయాన్ని బిజెపి నాయకులు ఆలోచించాలన్నారు. ప్రజల హక్కులను ఉపకారాలుగా చూపించే ప్రయత్నాలను తెలంగాణ ప్రజలు ఎన్నటికీ అంగీకరించరని, అనవసర విమర్శలు, డొంకతిరుగుడు మాటలు మానేసి తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకరావాలని, మరిన్ని ప్రాజెక్టులు తీసుకురావడంపై రాష్ట్ర బిజెపి నాయకత్వం దృష్టి సారించాలని పొన్నం సలహా ఇచ్చారు.

## మారుతున్న తెలంగాణ ముఖచిత్రం..



హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, పర్యాటకరంగాల ప్రగతికి విమానయాన రంగాన్ని విస్తరించడం ఎంతో కీలకంగా మారింది. ఇందులో భాగంగా వరంగల్ విమానాశ్రయంతో పాటు పలు జిల్లాల్లో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు సంబంధించి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వేగంగా అడుగులు వేస్తోంది. దీని ద్వారా రాష్ట్రంలోని అన్ని కీలక ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. వరంగల్ విమానాశ్రయ పునరుద్ధరణ, పూర్తిస్థాయి అభివృద్ధి కోసం AAI సుమారు రూ. 496.86 కోట్ల వ్యయంతో సూత్రప్రాయ ఆమోదం తెలపడమే కాకుండా, రన్‌వే, టాక్సీవే, సరిహద్దు గోడ నిర్మాణాల కోసం టెండర్లను సైతం ఆహ్వానించింది. అయితే, భూసేకరణ, పర్యావరణ అనుమతులు, నిధుల లభ్యత ఆధారంగానే ఈ ప్రాజెక్టు పూర్తి కానుందని కేంద్ర పౌర విమానయాన శాఖ తెలిపింది. మరోవైపు ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని పౌర, రక్షణ రంగాల ఉమ్మడి వినియోగం కోసం అభివృద్ధి చేసేందుకు AAI ఇప్పటికే ఫీజిబిలిటీ అధ్యయనం పూర్తి చేసింది. అలాగే పెద్దపల్లిలోని గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ప్రాథమిక నివేదికను రాష్ట్రానికి అందజేయగా, భద్రాద్రి కొత్తగూడెం ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి. ఈ నూతన విమానాశ్రయాలు పూర్తయితే తెలంగాణలో ప్రాంతీయ అనుసంధానం మరింత బలోపేతం కానుంది.

## హస్తినలో హైటెన్షన్ వాతావరణం..



న్యూఢిల్లీ, దేశ రాజధాని ఢిల్లీ లో పొలిటికల్ హీట్ తారాస్థాయికి చేరింది. ఇటీవల చోటుచేసుకున్న విద్యార్థుల నిరసనలు, పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలు, తీవ్ర అవకతవకలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు తీవ్ర స్థాయిలో నిరసనకు దిగారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసం నుంచి ప్రధాని నరేంద్ర మోదీ అధికారిక నివాసం వైపు కాంగ్రెస్ నేతలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అయితే, ర్యాలీగా వెళ్లిన కాంగ్రెస్ ఎంపీలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు పలువురు సీనియర్ నాయకులు ప్రధాని నివాసం ఎదుటే రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. మోదీ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రధాని నివాస ప్రాంతం అంతా.. 'తానాషాహీ నహీ చలేగీ', 'మోదీ ఇస్తీఫా దో' అనే నినాదాలతో హోరెత్తుతోంది. విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుతోందని, పరీక్షల నిర్వహణలో వరుసగా జరుగుతున్న అక్రమాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

### కర్ణాటక మాజీ సీఎం జోరు..

అయితే, ప్రధాన మోదీ నివాసం ముట్టడి కార్యక్రమంలో స్పెషల్ ఎట్రాక్షన్‌గా కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య (ాఱుఎుఝుతీఝుఝుఖుఝుష్ర) నిలిచారు. ఆయన పలువురు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నేతలు, ఎంపీలు, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు హాజరై వారిలో ఉత్సాహం నింపుతూ సంఘీభావం తెలిపారు. ప్రధాని నివాస పరిసర ప్రాంతాల్లో భద్రతా బలగాలు భారీగా మోహరించడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనకారులను అదుపు చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## అంతా నాటకమే?.. ట్రైనీ ఐపీఎస్ కేసులో బిగ్ ట్విస్ట్..



హైదరాబాద్,తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర కలకలం రేపిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారంలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్‌ను లైంగికంగా వేధించడంతో పాటు, ప్రైవేట్ వీడియోలు ఆమె భర్తకు పంపిస్తానని బెదిరించినట్లు కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఆరోపణల నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురైన ఆయన, తాను ఏ పాపం చేయలేదంటూ సోమవారం ఆత్మహత్యాయత్నం చేయడం పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది.

### డాక్టర్ల పరీక్షల్లో నిజాలు వెల్లడి:

సోమవారం ఉదయం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడనే ప్రచారంతో ఉదయ్ కృష్ణారెడ్డిని కుటుంబ సభ్యులు ఎస్సార్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే ఆయన రక్త నమూనాలను పరీక్షించిన వైద్యులు, రక్తంలో ఎలాంటి విషపదార్థాలు లేవని స్పష్టం చేశారు. కేవలం సానుభూతి పొందడం కోసమే ఫూటుగా మద్యం సేవించి ఈ నాటకానికి తెరలేపినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. మద్యం మత్తులోనే ఆయన సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు భావిస్తున్నారు.

### పోలీసుల సీరియస్ విచారణ:

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి గతంలో కానిస్టేబుల్‌గా పనిచేసి, పట్టుదలతో ఐపీఎస్‌గా ఎంపికై వార్తల్లో నిలిచారు. అయితే సదరు మహిళా ఐపీఎస్‌తో తనకు ఏడాదిగా రిలేషన్ ఉందని, కక్షతోనే తనపై నిరాధార ఆరోపణలు చేశారని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం జాతీయ పోలీస్ అకాడమీ అధికారులు అంతర్గత విచారణ జరుపుతుండగా, అత్తాపూర్ పోలీసులు సీసీటీవీ ఫుటేజ్‌తో పాటు కృష్ణారెడ్డి ఫోన్‌ను స్వాధీనం చేసుకుని లోతుగా విచారిస్తున్నారు.

## విద్యార్థులపై పడ్డ ప్రతి లాఠీ దెబ్బకు బీజేపీ మూల్యం చెల్లించుకోక తప్పదు



హైదరాబాద్,ఢిల్లీలో ఆందోళన చేస్తున్న యువతపై పోలీసులు లాఠీచార్జి చేయడంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులపై పడ్డ ప్రతి లాఠీ దెబ్బకు, చిందిన ప్రతి రక్తపు బొట్టుకూ బీజేపీ పార్టీ ప్రజాక్షేత్రంలో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అసమర్థ పాలనపై, పేపర్ లీకులపై శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులపై కాషాయ కసాయి పాలకులు చేసిన లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. భావి భారతాన్ని తీర్చిదిద్దే యువతపై లాఠీలు ప్రయోగించడం మోడీ ప్రభుత్వ అహంకారానికి, నియంతృత్వ ధోరణికి నిదర్శనం అన్నారు. బీజేపీ అసమర్థ పాలనపై పోరాడుతున్న యువతపై లాఠీచార్జ్ చేయడం, పేపర్ లీకులతో విసిగిపోయి, తమ హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులను శత్రువుల్లా చూస్తూ, బూటుకాళ్ల కింద తొక్కిపడేయడం ఇదేనా మోడీ గారు మీ 'అచ్చే దిన్'? అని ప్రశ్నించారు. తమ న్యాయమైన హక్కుల కోసం, భవిష్యత్తు కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువతకు, విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుంది. యువత పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాడుతుంది.

### సిక్కింలో ఘోర ప్రమాదం

సిక్కిం లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నమాచిలోని హైడ్రో ప్రాజెక్టు టన్నెల్లో 27 మంది కార్మికులు చిక్కుకున్నారు. వారిని ఏడుగురు మృతి చెందారు. టన్నెల్లో పని చేస్తుండగా కొండచరియలు విరిగిపడి ప్రవేశ ద్వారం మూసుకుపోయింది. టన్నెల్ లో మీథేన్ వాయువు విడుదల కావడంతో సహాయక చర్యలకు ఇబ్బందిలు ఏర్పడ్డాయి. టన్నెల్లో చిక్కుకున్న వారిలో ఏడుగురు మృతి చెందినట్లు అధికారులు ధృవీకించారు. మిగతా కార్మికుల కోసం సహాయక చర్యలు యుద్ధప్రాతిపాదికన కొనసాగుతున్నాయి.

## ఇందిరమ్మ ఇండ్ల పేరుతో కాంగ్రెస్ కొత్త నాటకం..



హైదరాబాద్, జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కొత్త నాటకానికి తెరలేపిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు కోసం రూ. 100, ఈఎండీ డిపాజిట్ కింద రూ. 10,000 వసూలు చేయడం దుర్మార్గమని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పేరుతో రూ. 32 వేలు వసూలు చేసిన తీరునే ఇది గుర్తుచేస్తోందని.. ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ. 1,000 కోట్ల ఆదాయం వస్తుందని ఆరోపించారు. వైఎస్సార్ హయాంలో చేపట్టిన 'రాజీవ్ స్వగృహ' ఇళ్లు ఏమయ్యాయో సమాధానం చెప్పాలని దరఖాస్తు రుసుములు వసూలు చేశాక అసలు ఇళ్లు ఇస్తారో లేదోనన్న సందేహం ఉందన్నారు. అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన' కింద ఇస్తున్న నిధులు, సబ్సిడీలను వాడుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని రామచందర్ రావు పేర్కొన్నారు. గ్రేటర్ వ్యాప్తంగా లక్షలాది మంది ఇళ్లు లేని పేదలు ఉంటే.. ప్రభుత్వం కేవలం 7,680 ఫ్లాట్లు మాత్రమే ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. జవహర్‌నగర్‌లో నిర్మించిన 20 అంతస్తుల భవనాల్లో వందలాది ఫ్లాట్లు ఏళ్లతో తరబడి ఖాళీగా ఉన్నా పేదలకు కేటాయించలేదని మండిపడ్డారు. కొద్దిమందికి ఇళ్లు కేటాయించి గొప్పలు చెప్పుకోవడం కాకుండా అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'క్యూర్' చట్టంతో పన్నుల భారం: కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ చట్టం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలపై అదనపు పన్నుల భారం పడుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం 5 శాతం వరకు పన్నులు పెరిగే అవకాశం ఉందన్నారు. రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, ప్రజాభిప్రాయం తీసుకోకుండానే ఈ చట్టాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. నీరు, మురుగునీటి సరఫరా సేవలను విడదీసి వేర్వేరుగా పన్నులు వసూలు చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఈ అంశంపై అసెంబ్లీలో తీవ్ర నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు.

# అమెరికా అండతో ఉధృతమవుతున్న యెమెన్ సంక్షోభం




టెహ్రాన్: సౌదీ అరేబియా గగనతలం మరోసారి భగ్గుమంది. యెమెన్ లోని హౌతీ రెబల్స్, సౌదీ అరేబియాలోని అభా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని లక్ష్యంగా చేసుకుని క్షిపణులు మరియు డ్రోన్లతో విరుచుకుపడ్డారు. సనా విమానాశ్రయంపై సౌదీ అరేబియా నిర్వహించిన దాడికి ప్రతీకారంగా ఈ చర్య చేపట్టినట్లు హౌతీలు ప్రకటించారు. ఈ సంఘటనతో, పశ్చిమాసియాలో ఇప్పటికే నెలకొన్న అస్థిరత మరింత తీవ్రమవుతుందనే భయాలు వ్యక్తమవుతున్నాయి. సనా విమానాశ్రయం వద్ద వివాదం: నిప్పు రవ్వ : తాజా ఘర్షణలకు బీజం సనా అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద జరిగిన ఒక ఘటనతో పడింది. ఇరాన్ కు చెందిన 'మహాన్ ఎయిర్' విమానం, హౌతీల నియంత్రణలో ఉన్న సనా విమానాశ్రయంలో దిగడం ఈ ఉద్రిక్తతలకు కేంద్ర బిందువుగా మారింది. ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరైన హౌతీ ప్రతినిధి బృందాన్ని ఈ విమానం యెమెన్ కు చేర్చింది. అయితే, ఈ విమానం ద్వారా ఆయుధాలు, క్షిపణి విడిభాగాలు లేదా ఇరాన్ సైనిక సిబ్బందిని హౌతీలకు చేరవేసే అవకాశం ఉందని సౌదీ అరేబియా గట్టిగా అనుమానించింది. అమెరికా అధికారులు కూడా మహాన్ ఎయిర్ ను ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తో అనుబంధం ఉన్న సంస్థగా అభివర్ణించడం ఈ అనుమానాలకు బలం చేకూర్చింది. ఈ నేపథ్యంలో, ఇరాన్ విమానం తిరుగు ప్రయాణంలో సనా విమానాశ్రయం చేరకుండా నిరోధించడానికి సౌదీ అరేబియా సైనిక బలగాలు రన్‌వేపై దాడులు నిర్వహించాయి. దీనితో ఆ విమానం దారి మళ్లించి, యెమెన్ తీరంలోని ఎర్ర సముద్ర తీరంలో ఉన్న అల్–హుదైదా విమానాశ్రయంలో దిగింది. యెమెన్ లోని అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రభుత్వం కూడా, ఇరాన్ విమానం యెమెన్ భూభాగాన్ని ఉపయోగించకుండా అడ్డుకోవడానికే ఈ దాడి చేపట్టినట్లు ధృవీకరించింది. ఈ విధంగా, ఒక సాధారణ రవాణా విమానం కదలిక గగనతలంలో పెద్ద సంక్షోభానికి దారితీసింది. హౌతీల ప్రతీకార దాడులు: ప్రతీకార స్వరూపం : సనా విమానాశ్రయంపై సౌదీ అరేబియా దాడి చేసిన కొద్ది గంటల్లోనే, హౌతీలు ప్రతీకార చర్యలకు దిగారు. సౌదీ అరేబియాలోని అభా అంతర్జాతీయ విమానాశ్రయంపై బహుళ క్షిపణులు మరియు డ్రోన్లతో దాడులు నిర్వహించారు. హౌతీల సైనిక ప్రతినిధి యాహ్యా సరీ, తాము చేసిన ఈ దాడి సౌదీ అరేబియా దాడులకు ప్రతీకారమని స్పష్టంగా ప్రకటించారు. సనా విమానాశ్రయంపై విధించిన ఆంక్షలు మరియు అడ్డంకులు ఎత్తివేసే వరకు, అంతర్జాతీయ విమానయాన సంస్థలు సౌదీ గగనతలంలో విమానాలు నడపవద్దని హౌతీలు హెచ్చరిక జారీ చేశారు. రోగులు మరియు ఇతర సామాన్యులను తరలిస్తున్న మానవతా విమానాలను అడ్డుకోవడమే సనాలో జరిగిన దాడుల లక్ష్యమని వారు తీవ్రంగా ఆరోపించారు. అంతేకాదు, ఈ దురాక్రమణకు సరైన సమాధానం లేదా శిక్ష తప్పకుండా ఉంటుందని హెచ్చరించారు. ఈ దాడుల్లో ప్రాణనష్టం జరిగినట్లు ఎలాంటి అధికారిక సమాచారం లేనప్పటికీ, సౌదీ అరేబియా ప్రభుత్వం నష్టం వివరాలను రహస్యంగా ఉంచింది. హౌతీలపై దాడులకు అమెరికా మద్దతు: అంతర్జాతీయ కోణం : ఈ ఘర్షణలో అమెరికా భాగస్వామ్యం మరింత ఆందోళన కలిగిస్తోంది. యెమెన్ లోని హౌతీ తిరుగుబాటుదారులపై సైనిక చర్యలు ప్రారంభించే ముందు, సౌదీ అరేబియా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతు కోరినట్లు ఓ విశ్వసనీయ మీడియా కథనం వెల్లడించింది. ఆక్సియోస్ నివేదిక ప్రకారం, సౌదీ చేపట్టిన ఈ చర్యలకు ట్రంప్ కూడా అంగీకారం తెలిపారు. ఈ మద్దతు పొందిన తరువాతనే, సౌదీ బలగాలు హౌతీల నియంత్రణలోని ప్రాంతాలపై దాడులు ప్రారంభించాయి. ఈ అంశం, అమెరికా యెమెన్ అంతర్యుద్ధంలో నేరుగా కాకపోయినా, పరోక్షంగా సౌదీ అరేబియాకు మద్దతు ఇస్తోందని స్పష్టం చేస్తోంది. ఇది ఇరాన్ మరియు అమెరికా మధ్య ఉన్న ప్రచ్ఛన్న యుద్ధాన్ని యెమెన్ గడ్డపైకి తెచ్చి, పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తోంది. ఐక్యరాజ్యసమితి ఆందోళన: చర్చల పిలుపు : ఈ పరిణామాల పట్ల అంతర్జాతీయ సమాజం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఈ ఘర్షణలపై అత్యవసర సమావేశం నిర్వహించింది. ఐరాస రాజకీయ వ్యవహారాల సహాయ ప్రధాన కార్యదర్శి ఖాలిద్ ఖియారీ, "యెమెన్ తో పాటు మొత్తం పశ్చిమాసియా ప్రాంతం మరోసారి తీవ్ర ఘర్షణల దిశగా వెళ్లే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు. అన్ని పక్షాలు సంయమనం పాటించాలని, హింసను విడనాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇరు వర్గాలు తమ సమస్యలను ఐరాస ఆధ్వర్యంలో జరిగే శాంతి చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. 2022లో ఐరాస మధ్యవర్తిత్వంతో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత, కొంతకాలం పాటు యెమెన్ లో హింసాత్మక సంఘటనలు తగ్గాయి. కానీ తాజా దాడులతో, ఈ సున్నితమైన కాల్పుల విరమణ ఒప్పందం ప్రమాదంలో పడింది.

చారిత్రక నేపథ్యం

2014లో ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారులు యెమెన్ రాజధాని సనాను స్వాధీనం చేసుకోవడంతో దేశంలో అంతర్యుద్ధం ప్రారంభమైంది. ఈ తిరుగుబాటును అణచివేయడానికి, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రభుత్వానికి మద్దతుగా 2015లో సౌదీ అరేబియా నేతృత్వంలోని సైనిక కూటమి యుద్ధంలో జోక్యం చేసుకుంది. అప్పటి నుండి, యెమెన్ తీవ్రమైన మానవతా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. 2022లో ఐరాస మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ అమలులోకి వచ్చినప్పటికీ, శాశ్వత శాంతి మాత్రం దూరంగానే మిగిలిపోయింది. తాజా దాడులతో ఇరుపక్షాల మధ్య ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగాయి, ఇది యెమెన్ భవిష్యత్తును అనిశ్చితిలో పడేసింది.

# టీడీపీ,జనసేన నేతల మధ్య టగ్ ఆఫ్ వార్ తప్పదా?



విజయవాడ, జూలై 21, ంధ్రప్రదేశ్ రాజకీయం ప్రస్తుతం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల చుట్టూ తిరుగుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో చారిత్రాత్మక విజయంతో కూటమి పక్షాలైన తెలుగుదేశం, జనసేన, బీజేపీలు అధికారంలోకి వచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం రాబోయే స్థానిక పోరు సరికొత్త సమీకరణాలను తెరపైకి తెస్తోంది. ఈ ఎన్నికల్లో అధికార కూటమికి విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దగా పోటీ ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అసలైన పోటీ, అంతర్గత ఘర్షణ అంతా కూటమి భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేన మధ్యే కేంద్రీకృతమైంది. గ్రామీణ స్థాయి అధికారం, ఉనికి కోసం ఇరు పార్టీల ద్వితీయ శ్రేణి నాయకత్వం ఒకరితో ఒకరు తలపడటానికి సిద్ధమవుతుండటంతో, లోకల్ పోల్స్ కాస్తా కూటమి అంతర్గత బల ప్రదర్శనకు వేదికగా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

1. సీట్లపై ఏకాభిప్రాయం కష్టమే!

ప్రధాన కారణం సీట్ల కేటాయింపులపై ఇరు పార్టీల అగ్రనేతల మధ్య వ్యూహాత్మక భిన్నాభిప్రాయాలు వ్యూహాత్మకంగా బయటకు రావడమే.

టీడీపీ భావన: గత అసెంబ్లీ ఎన్నికల నాటి సీట్ల పంపకాల ఫార్ములా (టీడీపీకి 85 శాతం, జనసేనకు 15 శాతం) బేస్ చేసుకుని స్థానిక సంస్థల్లోనూ ముందుకెళ్లాలని భావించింది.

జనసేన అభ్యంతరం: ఈ అసెంబ్లీ ఫార్ములా క్షేత్రస్థాయిలో అస్సలు పనిచేయదని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తేల్చేశారు. సార్వత్రిక ఎన్నికల నాటి త్యాగాలను ప్రతి ఊరిలోనూ పునరావృతం చేయలేమని, క్షేత్రస్థాయిలో తమకున్న బలాన్ని బట్టి తాము తగ్గేదే లేదంటూ జనసేన పట్టుబట్టడం కూటమి శ్రేణుల్లో ఒక్కసారిగా రాజకీయ వేడిని పుట్టించింది.

2. క్యాడర్ బలాన్ని చాటుకునేందుకు లీడర్ల పట్టు

ముఖ్యంగా ఉమ్మడి గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, విశాఖపట్నం, రాయలసీమలోని కొన్ని కీలక నియోజకవర్గాల పరిధిలో ఈ కోల్డ్ వార్ తీవ్ర రూపం దాల్చుతోంది. టీడీపీ కేడర్ వాదన: గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ వేధింపులను తట్టుకుని నిలబడిన స్థానిక టీడీపీ కేడర్.. "మేము ఎమ్మెల్యే సీటునే త్యాగం చేశాం, కనీసం మా ఊరి సర్పంచ్, ఎంపీటీసీ సీటు కూడా మాకు ఇవ్వకపోతే ఎలా?" అని గట్టిగా నిలదీస్తున్నారు.

జనసైనికుల డిమాండ్: కూటమి అధికారంలోకి రావడానికి తమ ఓట్లే ప్రధాన కారణమని, క్షేత్రస్థాయిలో తమ అభ్యర్థులకు మెజారిటీ స్థానాలు కేటాయించకపోతే ఊరుకునేది లేదని జనసేన ద్వితీయ శ్రేణి లీడర్లు భీష్మించుకు కూర్చున్నారు. పైస్థాయిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మధ్య ఉన్న కెమిస్ట్రీ కిందిస్థాయి గడప దాటడం లేదనేది దీని ద్వారా స్పష్టమవుతోంది.

3. పెరగనున్న తిరుగుబాటు అభ్యర్థుల ముప్పు

ఈ రాజకీయం రాబోయే రోజుల్లో పలు ఆసక్తికరమైన మలుపులు తిరిగే అవకాశం ఉంది. ఎక్కడైతే అధికారికంగా సీటు దక్కదో, అక్కడ ఇరు పార్టీల ఆశావహులు రెబల్స్ అభ్యర్థులుగా బరిలోకి దిగడానికి సిద్ధమవుతున్నారు. పల్లెల్లో సర్పంచ్ స్థానం అనేది కేవలం ఒక పదవి మాత్రమే కాదు, అది గ్రామాల్లో ఒక నిర్దిష్ట సామాజిక వర్గానికి, కుటుంబానికి ఉండే ప్రతిష్టకు సంబంధించిన అంశం. అందువల్ల అగ్రనాయకత్వం ఎంత ఒత్తిడి తెచ్చినా కిందిస్థాయి లీడర్లు వెనక్కి తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. ఈ అంతర్గత ఓట్ల చీలిక కొన్నిచోట్ల స్వతంత్రులకు లేదా తెరవెనుక పొంచి ఉన్న విపక్ష వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు అనూహ్యంగా లాభం చేకూర్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

పరిష్కార మార్గాలు: సమన్వయం సాధించడం ఎలా?

పైస్థాయి నాయకత్వం మధ్య ఉన్న సమన్వయం కింద కూడా లేకపోతే వచ్చే ఈ తీవ్రమైన సమస్యలను పరిష్కరించుకోవడానికి కూటమి అధిష్టానం సరికొత్త అస్త్రాలను ప్రయోగించాల్సి ఉంటుంది. ఉమ్మడి కో–ఆర్డినేషన్ కమిటీలు: కేవలం నోటి మాటలతో కాకుండా, జిల్లాల వారీగా, నియోజకవర్గాల వారీగా ఇరు పార్టీల కీలక నేతలతో కమిటీలను ఏర్పాటు చేయాలి. ఫ్రెండ్లీ కాంటెస్ట్ : ఎక్కడైతే ఇరు పార్టీలు బలంగా ఉన్నాయో, అక్కడ ఏకాభిప్రాయం కుదరకపోతే.. ఆయా గ్రామాల్లో స్నేహపూర్వక పోటీకి అనుమతించడం. సీట్ల సమతుల్యత: ఒక పార్టీకి సర్పంచ్ స్థానం ఇస్తే, మరో పార్టీకి ఎంపీటీసీ ఇచ్చేలా సమతుల్యత పాటించడం ఏకైక మార్గంగా కనిపిస్తోంది. మొత్తానికి ఈ స్థానిక సంస్థల ఎన్నికలు కూటమి ప్రభుత్వ ప్రజాదరణకు మాత్రమే కాదు, వారి అంతర్గత బంధానికి కూడా ఒక పెద్ద అగ్నిపరీక్ష. పైస్థాయిలో ఉన్న దోస్తీని క్షేత్రస్థాయి సమన్వయం ద్వారా పల్లెల్లోకి తీసుకెళ్లడంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఎంతవరకు సఫలమవుతారనే దానిపైనే కూటమి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. తమ సొంత అహంకారాలు, ఈక్వేషన్ల వల్ల పొత్తుల రొంపిలో తమ్ముళ్లు, సైనికులు కొట్టుకోకుండా చూసుకోవడమే ప్రస్తుతం కూటమి ముందున్న అసలైన టాస్క్.

# ట్రాఫిక్ పోలీసులకు ఇకపై మొబైల్ వాడకం నిషేధం

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రంలో విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసులకు సంబంధించి ప్రభుత్వం కీలకమైన ఆలోచన చేస్తోంది. ఇందులో భాగంగా ట్రాఫిక్ పోలీసులకు కొత్త రూల్స్ తీసుకురావడానికి ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇకపై డ్యూటీ సమయంలో సిబ్బంది ఎవరూ వ్యక్తిగత మొబైల్ ఫోన్లు వాడకూడదని నిబంధన తీసుకురానున్నారు. రోడ్లపై వాహనాల రాకపోక్రలను పర్యవేక్షించే సమయంలో ఫోన్ల మీద ధ్యాస పెడితే విధులకు ఆటంకం కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

మొబైల్ వాడకం వల్ల నష్టాలు ఏమిటి

డ్యూటీ వేళల్లో ఫోన్లు చూడటం వల్ల సిబ్బంది చుట్టూ జరిగే పరిణామాలపై దృష్టి పెట్టలేకపోతున్నారు. దీనివల్ల కొన్నిసార్లు అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే స్పందించడం కష్టమవుతోంది. ప్రజల భద్రతను కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై పూర్తిగా ఉంటుంది కాబట్టి వారి పూర్తి ఏకాగ్రత విధుపైన మాత్రమే ఉండాలి. ఈ కారణం చేతనే మొబైల్ ఫోన్ల వాడకానికి చెక్ పెట్టాలని ఉన్నతాధికారులు నిర్ణయానికి వచ్చారు. ఫోన్లకు బదులుగా కేవలం



అధికారిక సమాచార మార్పిడి కోసం మాత్రమే వీహెచ్ఎఫ్ సెట్లను ఉపయోగించే విధానం త్వరలో అమలులోకి రానుంది. దీనిద్వారా అత్యవసర సమయాల్లో సిబ్బంది ఒకరితో ఒకరు వేగంగా మాట్లాడుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వ ఆమోదం రాగానే ఈ కొత్త నిబంధనలు రాష్ట్రవ్యాప్తంగా కఠినంగా అమలు చేయనున్నారు.

# రేవంత్‌ను ఏమీ అనలేక మల్లారెడ్డిపై అటాక్

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో సీనియర్ నేత, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని లక్ష్యంగా చేసుకుని సొంత పార్టీ సోషల్ మీడియా విభాగాలు ఒక్కసారిగా దాడికి దిగడం ఇప్పుడు రాష్ట్ర పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రజాకవి అందెశ్రీకి సంబంధించిన ఒక అధికారిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి మల్లారెడ్డి ఒకే వేదికను పంచుకున్నారు. ఆ సమయంలో సీఎం రేవంత్ రెడ్డి వేదికపై నుంచే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో రాజకీయ విమర్శలు గుప్పించారు. అయితే, రేవంత్ రెడ్డి విమర్శలు చేస్తున్నప్పుడు పక్కనే ఉన్న మల్లారెడ్డి వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయలేదని, కనీసం నిరసన కూడా తెలపకుండా మౌనంగా ఉండిపోయారనేది గులాబీ శ్రేణుల ప్రధాన ఆగ్రహం.

మౌన రాజకీయాలు చేస్తున్న మల్లారెడ్డి

వాస్తవానికి, గత కొంతకాలంగా బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాల్లో మల్లారెడ్డి పెద్దగా చురుగ్గా వ్యవహరించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఆయన పార్టీ కార్యక్రమాలకు కాస్త దూరంగానే ఉంటున్నారు. వర్తమాన రాజకీయాల్లో ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా భారీ విద్యాసంస్థలు, వ్యాపార సామ్రాజ్యాలు ఉన్న నాయకులు ఎదుర్కొనే రాజకీయ ఒత్తిళ్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏ రకమైన సమీకరణాలు, వ్యూహాలతో మల్లారెడ్డిని పార్టీలోకి చేర్చుకున్నారో.. ఇప్పుడు కేంద్ర, రాష్ట్రాల్లోని అధికార పార్టీలు కూడా అదే తరహా ఒత్తిళ్లకు లేదా ఆకర్షణ మంత్రాలకు పాల్పడుతున్నాయనేది బహిరంగ రహస్యం.

బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా మాట్లాడని మల్లారెడ్డి

ఇలాంటి కత్తిమీద సాము లాంటి పరిస్థితుల్లో, ఆయన పార్టీ మారుతారనే ప్రచారం జరుగుతున్నప్పటికీ, సొంత పార్టీ బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఎక్కడా ఒక్క మాట కూడా మాట్లాడకుండా సైలెంట్‌గా ఉండటమే ఒక రకంగా గొప్ప విషయం. ఈ సున్నితమైన తరుణంలో మల్లారెడ్డి లాంటి సీనియర్ నేతను గుర్తించకుండా, ఆయనపై సోషల్ మీడియా ద్వారా దాడి చేయించడం వల్ల బీఆర్ఎస్‌కు ఎలాంటి రాజకీయ ప్రయోజనమూ ఉండదు. మల్లారెడ్డి కేవలం ఒక సాధారణ ఎమ్మెల్యే



మాత్రమే కాదు; మేడ్చల్ నియోజకవర్గంతో పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తనకంటూ ఒక ప్రత్యేక వర్గాన్ని, బలమైన అనుచరగణాన్ని సంపాదించుకున్న ఒక స్టేచర్ ఉన్న లీడర్. ఆయన వ్యాపారాలు, విద్యాసంస్థల రక్షణ కోసం అధికార పక్షంతో సఖ్యతగా ఉండటం రాజకీయంగా సహజం. అంతమాత్రానికే ఆయనను బలిపశువును చేస్తూ ట్రోలింగ్ చేయడం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ.

బీఆర్ఎస్‌లోనే ఉంటే ఏం చేస్తారు?

రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరు. రేపటి రోజున రాజకీయ సమీకరణాలు మారి, కాంగ్రెస్ లేదా బీజేపీ కంటే బీఆర్ఎస్ పార్టీయే తమ భవిష్యత్తుకు బెటర్ అని మల్లారెడ్డి భావిస్తే.. ఆయన పార్టీ మారాలనే ఆలోచనను పక్కన పెట్టి మళ్లీ గులాబీ గూటిలోనే కొనసాగే అవకాశం ఉంటుంది. అలా కాకుండా ఇప్పుడే ఆయనను టార్గెట్ చేసి దూరం చేసుకుంటే, ఆయన అధికార పార్టీ వైపు అడుగులు వేయడానికి బీఆర్ఎస్సే స్వయంగా దారి చూపించినట్లవుతుంది. కాబట్టి, ఆవేశంతో కాకుండా ఆలోచనతో, మల్లారెడ్డి లాంటి సీనియర్ల విషయంలో వ్యూహాత్మక మౌనాన్ని ప్రదర్శించడమే బీఆర్ఎస్ లీడర్‌షిప్‌కు మేలు చేకూరుస్తుందని అనుకోవచ్చు.

# కోకాపేటలో మరో మెగా వెంచర్.. రూ.9 వేల కోట్ల ఆదాయంపై సర్కార్ ఫోకస్




హైదరాబాద్, హైదరాబాద్‌లో అత్యంత విలువైన రియల్ ఎస్టేట్ కేంద్రంగా మారిన కోకాపేట్‌లో మరో భారీ వెంచర్‌ను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. రాష్ట్ర ఖజానాకు భారీ ఆదాయం తెచ్చిపెడుతున్న ఈ ప్రాంతంలో అందుబాటులో ఉన్న భూములను విక్రయించే దిశగా హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) చర్యలు చేపడుతోంది.

117 ఎకరాల భూమి..

గతంలో ఐటీ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) కోసం కేటాయించిన సుమారు 117 ఎకరాల భూమిలో కొంత భాగాన్ని మాత్రమే సంస్థలు కొనుగోలు చేశాయి. ప్రస్తుతం 90 ఎకరాలకు పైగా భూమి అందుబాటులో ఉండటంతో ఈ భూములను విక్రయించి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలని అధికారులు యోచిస్తున్నారు. ఇందుకోసం సెజ్ హోదాను రద్దు చేసే (డీనోటిఫికేషన్) ప్రక్రియను ప్రారంభించారు.

ఎకరం రూ.151 కోట్లు

ఇటీవలి కాలంలో కోకాపేట్ భూములకు రియల్ ఎస్టేట్ మార్కెట్లో భారీ డిమాండ్ ఏర్పడింది. ఐటీ, వాణిజ్య సంస్థలు పెద్దఎత్తున స్థిరపడటంతో ఈ ప్రాంతం పెట్టుబడిదారులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా మారింది. దీంతో ఇక్కడి భూముల ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ఇటీవల నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఎకరం భూమి గరిష్టంగా రూ.151 కోట్లకు అమ్ముడు కాగా.. సగటున రూ.142 కోట్ల ధర పలికింది. ఈ నేపథ్యంలో సెజ్ భూములను మార్కెట్లోకి తీసుకురావడం ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎకరానికి కనీసం రూ.100 కోట్ల చొప్పున ధర లభించినా 90 ఎకరాలకు పైగా ఉన్న భూముల విక్రయం ద్వారా రూ.9 వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సెజ్ హోదా రద్దుకు ఆమోదం తెలిపిన వెంటనే అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అన్ని మౌలిక సదుపాయాలతో కొత్త వెంచర్‌ను అభివృద్ధి చేయాలని హెచ్ఎండీఏ ప్రణాళికలు రూపొందిస్తోంది. గతంలో నియోపొలిస్ గోల్డ్‌మైల్ లేఅవుట్‌లను అభివృద్ధి చేసిన తరహాలోనే ఈ ప్రాజెక్టును కూడా అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దనున్నారు.

**సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్**

కరీంనగర్ ,కరీంనగర్ నగరంలోని 20వ డివిజన్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్ కుమార్ సహకారంతో రూ.70 లక్షల యుఐడిఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లకు సమాన ప్రాధాన్యతనిస్తూ మౌలిక సదుపాయాల

# హైదరాబాద్‌లో కొత్తగా మరో 15 రిటైల్ మాల్స్..



హైదరాబాద్, జూలై 21,హైదరాబాద్‌లో రిటైల్ రంగానికి లభిస్తున్న ఆదరణతో మరో 15 కొత్త మాల్స్ ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం 30కి పైగా మాల్స్ ఉండగా.. కొత్తగా 6 గ్రేడ్–1, పలు గ్రేడ్–2 మాల్స్ జతకానున్నాయి. సంధ్య లులూ, ఫోరం మాల్, వంశీరామ్, బ్రూక్‌ఫీల్డ్ వంటి దిగ్గజ మాల్స్ రాబోతున్నాయి. కాగా, నిర్వహణ భారం, ఆధునిక పోటీ తట్టుకోలేక పాత మాల్స్ క్రమంగా ఆస్పత్రులు, కామర్షియల్ టవర్లుగా మారుతున్నాయి. మరోవైపు నగరంలోని అన్ని దిక్కులా మాల్స్ కల్చర్ విస్తరిస్తున్నట్లు అనరాక్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. హైదరాబాద్ మహానగరంలో రిటైల్ రంగం శరవేగంగా విస్తరిస్తోంది. మాల్స్ సంస్కృతి నగరంలో కొత్త శిఖరాలకు చేరుకుంటోంది. తాజాగా అందిన వివరాల ప్రకారం.. ఈ సంవత్సరాంతానికి లేదా వచ్చే ఏడాది నాటికి గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా కొత్తగా మరో 15 మాల్స్ ప్రారంభం కానున్నాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే నగరంలో చిన్నవి, పెద్దవి కలిపి 30కి పైగా మాల్స్ అందుబాటులో ఉన్నాయి. దేశంలోనే అత్యంత వేగంగా విస్తరిస్తున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటి అని అనరాక్ వంటి ప్రముఖ రియల్ ఎస్టేట్ పరిశోధనా సంస్థలు వెల్లడిస్తున్నాయి. ఒకప్పుడు కేవలం సెంట్రల్ హైదరాబాద్ ప్రాంతానికే పరిమితమైన మాల్స్, ఇప్పుడు నార్త్, ఈస్ట్, వెస్ట్, సౌత్ అంటూ నగర నలుమూలలకూ విస్తరించాయి. కొత్తగా రాబోతున్న వాటిలో ఆరు మాల్స్ గ్రేడ్–1 కేటగిరీకి చెందినవిగా ఉండనున్నాయి. దీంతో నగరంలో గ్రేడ్–1 మాల్స్ సంఖ్య 9 నుంచి 15కి చేరనుంది. మరోవైపు.. కొత్తగా అత్యాధునిక మాల్స్ రూపుదిద్దుకుంటుండటంతో పాత మాల్స్ నిర్వహణ తీవ్ర భారంగా మారి తెరమరుగయ్యే పరిస్థితి నెలకొంది. కొన్ని పాత మాల్స్ ఇప్పటికే ఆస్పత్రులుగా, వాణిజ్య సముదాయాలుగా రూపాంతరం చెందుతుండగా.. మరికొన్ని మాల్స్ నిర్మాణ దశలోనే ఇతర వాణిజ్య సంస్థలుగా మారిపోతున్నాయి. నగరంలో రాబోతున్న ప్రధాన గ్రేడ్–1 మాల్స్ చూసినట్లయితే.. నార్సింగి వద్ద దేశంలోనే అతిపెద్ద మాల్స్‌లో ఒకటిగా సంధ్య లులూ మాల్ రానుంది. రాజేంద్రనగర్‌లోని ప్రెస్టీజ్ సిటీలో దాదాపు 12 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫోరం మాల్ నిర్మితమవుతోంది. గచ్చిబౌలి పరిసరాల్లో యూనిటీ మాల్, నార్సింగి వద్ద లగ్జరీ మాల్‌గా వంశీరామ్ మాల్, కోకాపేట వద్ద ఏరియా బై ఫెయిర్‌మౌంట్, కర్మాన్‌ఘాట్ వద్ద కొలీసియం మాల్ రూపుదిద్దుకుంటున్నాయి. వీటితో పాటు నానక్‌రామ్‌గూడ వద్ద ఎస్ఏఎస్ ఐ–టవర్స్ రిటైల్, రాయదుర్గంలో బ్రూక్‌ఫీల్డ్ కే రహేజా కార్ప్ మాల్, డౌన్ టౌన్ మాల్స్ అందుబాటులోకి రానున్నాయి. వీటితో పాటు మీడియం అండ్ కమ్యూనిటీ కేటగిరీ కింద రాబోతున్న గ్రేడ్–2 మాల్స్ నగరంలో రీజినల్ రిటైల్ అవసరాలను తీర్చనున్నాయి. హస్తినాపురంలో హెచ్ఎస్ఆర్ ఆర్క్ మాల్, మణికొండలో రామిరెడ్డి మాల్, బాలానగర్‌లో స్టార్ లైట్ మాల్, బండ్లగూడ పరిసరాల్లో టామ్రా మాల్ నిర్మాణంలో ఉన్నాయి. ఆధునిక సౌకర్యాలు, విశాలమైన పార్కింగ్, అంతర్జాతీయ బ్రాండ్లతో వస్తున్న ఈ కొత్త మాల్స్ రాకతో హైదరాబాద్ రిటైల్ మార్కెట్ స్వరూపమే మారిపోనుంది.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280